


# నవభూమి

## జిల్లా అనుబంధం

17 జూన్ ,2025 మంగళవారం పేజీలు: 9

www.epaper.navabhoomi.in


# పేదలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వం

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి
- రాబోయే మూడున్నర సంవత్సరాలలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తాం
- నేలకొండపల్లి మండలంలో పలు రోడ్డు నిర్మాణపనులకు శంకుస్థాపన, లబ్ధిదారుని ఇందిరమ్మ
- ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి పొంగులేటి,జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





**ఖమ్మం నవభూమి బ్యూరో, జూన్ 16:** పేదలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వం పాలన సాగిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి నేలకొండపల్లి మండలంలో పర్యటించి పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారు. గువ్వలగూడెం గ్రామం ఎస్సీ ప్రాంతంలో 30 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, గ్రామంలోని రావెళ్ల భూలక్ష్మి నరేష్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మంత్రి జిల్లా కలెక్టర్ తో కలిసి భూమి పూజ నిర్వహించి దంపతులకు కొత్తబట్టలు అందించారు. గ్రామంలో ఇంటి ముందు అడ్డంగా ఉన్న విద్యుత్ పోల్ తరలించాలని మంత్రి విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం కోరట్లగూడెం గ్రామంలో షుగర్ ఫ్యాక్టరీ రోడ్ నుండి పాత కోరట్లగూడెం వరకు 2 కోట్ల 50 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణానికి, మోటాపురం గ్రామంలో మోటాపురం నుండి జీళ్లచెరువు ఆర్ అండ్



బి రోడ్డు వరకు 4 కోట్ల 40 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. కోరట్లగూడెం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో అశ్వరావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గువ్వలగూడెం గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు 75 లక్షల రూపాయలు, లింక్ రోడ్డు నిర్మాణ పనులకు 13.5 కోట్ల రూపాయలు, మొత్తం దాదాపు 14 కోట్ల 25 లక్షలు రూపాయలను వివిధ రూపాల్లో ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మన ప్రభుత్వం పేదవాడి కన్నీరు తుడిచే విధంగా, పేదవాడికి అండగా, పేదవాడికి సహాయం చేసే విధంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం తీసుకొని రావడం జరిగిందని అన్నారు. 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్, పేదోడికి జబ్బు చేస్తే 10 లక్షల రూపాయల వరకు మెరుగైన వైద్యం అందించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్యక్రమం, ఆడబిడ్డలు ఎంత దూరం ప్రయాణం చేసినా ఉచితంగా బస్సులో ఒక్క రూపాయి చార్జీ లేకుండా ఉచిత బస్సు సౌకర్యం, ఆనాటి ప్రభుత్వం పది సంవత్సరాలలో 17 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేస్తే మన ఇందిరమ్మ ప్రభుత్వం 10 నెలల్లోనే 21 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసిందని అన్నారు. మన ప్రభుత్వం రైతులకు సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్ కు 500 రూపాయలు బోనస్ అదనంగా అందిస్తున్నదని, ఉగాది నుండి పేదలకు సన్న రకం బియ్యం సరఫరా



చేస్తున్నదని, గత పది సంవత్సరాల్లో కొత్త రేషన్ కార్డు గాని కొత్త పేర్లు రేషన్ కార్డులో చేర్చడం కానీ జరగలేదని, మన ఇందిరమ్మ ప్రభుత్వంలో మంజూరు చేసుకున్నామని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఇల్లు అంటేనే ఇందిరమ్మ ప్రభుత్వం అని, అటువంటిది మొదట విడత రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్ళు 22 వేల 500 కోట్ల రూపాయలతో అద్భుతంగా ప్రతి నియోజక వర్గానికి 3 వేల 500 ఇల్లు ఇచ్చామని, గువ్వలగూడెంలో ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన చేసుకుంటున్నామని అన్నారు. గ్రామాలలో ఇల్లు ఇవ్వాల్సిన అర్హులైన వాళ్ళు మిగిలి ఉన్నారని, వారికి ఇల్లు రాలేదని బాధపడాల్సిన అవసరం లేదని, రాబోయే మూడున్నర సంవత్సరాలలో నాలుగున్నర లక్షలతో కలిపి 20 లక్షల ఇందిరమ్మ ఇల్లు కట్టాలన్నదే మన ప్రభుత్వం యొక్క ఆలోచనని, అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం కలెక్టర్ గా



బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటి కార్యక్రమానికి హాజరు కావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లాను అభివృద్ధి లో మరింత ముందుకు తీసుకుని వెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి., విద్యుత్, సంబంధిత శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# సింగరేణి సంస్థ డైరెక్టర్ (పా)గా బాధ్యతలు చేపట్టిన గౌతమ్ పొట్రు





**కొత్తగూడెం జూన్ 16 నవభూమి ప్రతినిధి:** సింగరేణి సంస్థ లో డైరెక్టర్ పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్ (పా) గా నియమితులైన గౌతమ్ పొట్రు సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయము లోని డైరెక్టర్(పా) ఛాంబర్ నందు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సంధర్భముగా సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్(పిపి) కే.వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జనరల్ మేనేజర్లు, అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు, డైరెక్టర్ (పా) ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి తమ అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు పర్సనల్ డిపార్ట్మెంట్ జనరల్ మేనేజర్ కవితా నాయుడు ఐఆర్, పిఎం వింగ్, ఈఆర్పి, సూపర్ బజార్ ల అధికారులతో డిపార్ట్మెంట్ల వారీగా వారు నిర్వర్తించే పనులపై వివరాలను సమీక్షించారు. ఈ కార్యక్రమం లో జిఎం (పర్సనల్) ఆర్సి బెనెడిక్ట్ నికోలస్, జిఎం (పర్సనల్) జి.వి.కిరణ్ కుమార్, హెచ్ఓడి ఈఈ సెల్, ఎండి సూపర్ బజార్ ఏజేఎం మురళీధర్, ఏజిఎం(పర్సనల్) పిఎం వింగ్ జి.రాజేంద్ర ప్రసాద్, డిజిఎం (పర్సనల్) ఐఆర్ వింగ్ అజయ్ కుమార్, డిజిఎం (పర్సనల్) వై.వి.ఎల్. వరప్రసాద్, ఎస్.వేంకటేశ్వర రావు, బి.రాజ గోపాల్ పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై ఉక్కు పాదం మోపాలి

- ఎస్పీ రోహిత్ రాజు

**కొత్తగూడెం జూన్ 16 నవభూమి ప్రతినిధి:** ఎస్పీ రోహిత్ రాజు ఆయన కార్యాలయలో జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందు బాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించి తమ తమ నివాస ప్రాంతాల్లో, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చేయాలని తెలిపారు. ప్రాపర్టీ కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. వర్షాకాలంలో అధిక వర్షాలు సంభవించినపుడు లోతట్టు ప్రాంతాల ప్రజలను



అప్రమత్తం చేసే విధంగా ముందస్తుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి, భాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు

## సిపిఐ మండల రథసారథిగా యంగ్ టైగర్ భగత్ సింగ్



**చింతకాని, నవభూమి, జూన్ 16:** సిపిఐ మండల కార్యదర్శిగా యంగ్ టైగర్ భగత్ సింగ్ అలియాస్ దూసరి గోపాలరావు ఎన్నికయ్యారు. సోమవారం మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో జరిగిన 17వ సిపిఐ మహాసభలో నూతన కార్యదర్శిగా నేరేడు గ్రామానికి చెందిన యంగ్ టైగర్ భగత్ సింగ్ అలియాస్ దూసరి గోపాలరావు తో పాటు సహాయ కార్యదర్శులుగా మరో యువ నేత అబ్బూరి మహేష్ మార్గం శ్రీను మరో 47 మంది నూతన సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సిపిఐ నాయకులు నూతన కార్యదర్శివర్గాన్ని అభినందించారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు భాగం హేమంతరావు ఈ సందర్భంగా దూసరి గోపాల్ రావు సేవలను అభినందించారు. యువ నాయకుడిగా పార్టీకి ప్రజలకు, ప్రజలకు చేస్తున్న సేవలను కొనియాడారు. గోపాలరావుని ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. దూసరి ఎంపిక హర్షణీయం యువ నాయకుడు, కష్టపడే తత్వం, మంచితనం ప్రజాసేవ లక్ష్యంగా పనిచేస్తున్న దూసరి గోపాలరావుని సిపిఐ మండల కార్యదర్శిగా నియమించడం హర్షనీయమని చింతకాని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు లింగం రాంబాబు పేర్కొన్నారు. నేటి రాజకీయాల్లో యువతరం ముందుండాలని అప్పుడే రాజకీయాల్లో మార్పులు తీసుకురావచ్చు అని స్పష్టం చేశారు. సిపిఐ పార్టీ యువనేతకు మండల బాధ్యతలు అప్పగించడం గొప్ప విషయమని కొనియాడారు. తమ్ముడితో నా పయనం 20 సంవత్సరాలుగా కొనసాగుతున్నదని గోపాల్ రావు రాజకీయ ప్రజాసేవలో నేను పత్రికా రంగంలో పనిచేస్తున్నామని మా ఇద్దరిదీ అన్నదమ్ముల అనుబంధం అని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జమ్మల జితేందర్ రెడ్డి, నాయకులు కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, సింగ్ నరసింహారావు, మేకల నరసింహారావు సీతామహాలక్ష్మి, పగిడిపల్లి ఏసు, పావులూరు మల్లికార్జునరావు, దూసరి శ్రీరాములు, రాసాల మోహన్ రావు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేత హరీష్‌రావును కలిసిన గిరిబాబు

**జూలురుపాడు, జూన్ 16 (నవభూమి ప్రతినిధి)** భారత రాష్ట్ర సమితి పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధికార ప్రతినిధి వైరా నియోజక వర్గ ముఖ్య నాయకులు లకావత్ గిరిబాబు సోమవారం తెలంగాణ భవన్ లో మర్యాద పూర్వకంగా కలుసు కున్నారు.పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు ను ఎఫ్ వన్ ఫార్ములా కార్ రేస్ లో జరిగిన ఆర్థిక అవకతవలపై ఈ డి సోమవారం ప్రశ్నించనున్న తరుణంలో పార్టీ శ్రేణులు నిరసన తెలపటానికి రాజధానికి చేరుకున్నాయి. అందులో బాగంగా జిల్లా పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తో కలసి పార్టీ పెద్దలు తన్నీరు హరీష్ రావు,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తది తరులను కలుసుకొని వైరా నియోజక వర్గంలో పార్టీ స్థితి గతులపై చర్చించారు.ఆయనతో పాటు పార్టీ మండల నాయకులు చాపల మడుగు రాంమూర్తి,రామకృష్ణ,రామారావు తదితరులు ఉన్నారు.



# అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

- ట్విట్టర్, సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులను కూడా సత్వరమే పరిష్కరించాలి
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం నవభూమి బ్యూరో, జూన్ 16:** ప్రజావాణిలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలని, నిబంధనల ప్రకారం మనం ఏదైనా దరఖాస్తు పరిష్కారం చేయలేని సమయంలో కారణాలు తెలియజేస్తూ స్పష్టమైన సమాధానం ఇవ్వాలని అన్నారు. ప్రజావాణి దరఖాస్తులను జిల్లా అధికారులు పక్కాగా ట్రాక్ చేయాలని, మండలాల పరిధి నుంచి వచ్చే సమాధానాలు ఎలా ఉంటున్నాయో క్రాస్ చెక్ చేసుకోవాలని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారం కావాలని అన్నారు. ట్విట్టర్, సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులను కూడా సత్వరమే పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణి దరఖాస్తులను ఆన్ లైన్ చేస్తూ ట్రాక్ చేయాలని, ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని, అత్యవసర పరిస్థితుల్లో రాలేని పక్షంలో ముందస్తు అనుమతి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి సోమవారం నాడు ప్రజావాణి తర్వాత వివిధ శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో చాలా మంచి స్టాఫ్ ఉందని, భవిష్యత్తులో మంచి పని తీరు కొనసాగించాలని అన్నారు. వేంసూర్ మండలం బీరపల్లి గ్రామ ప్రజలు తమ గ్రామంలో ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం జరుగుతుందని, వాటిని వెంటనే నిలిపివేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వేంసూరు మండలం తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకొని రిపోర్ట్ సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం నగరం శ్రీరామ్ హిల్స్ ప్రాంతానికి చెందిన వనమా ఉషారాణి ధంసలాపురం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 194 లో 2 ఎకరాల వ్యవసాయ భూమి 2008 లో రిజిస్ట్రేషన్ చేసుకున్నానని, ఆ భూమిని ఇతరులు ఆక్రమించారని, భూ భారతి చట్టం ప్రకారం ఆ పట్టా పాస్ పుస్తకం రద్దు చేసి తన పేరున పట్టా పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం అర్బన్ తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన







చర్యలు నిబంధనల ప్రకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఖమ్మం నగరం బొక్కల గడ్డ 47వ డివిజన్ కు చెందిన చాట్ల సునీత తాను 15 సంవత్సరాలుగా కిరాయి ఇండ్లలో ఉంటున్నానని తనకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వేంసూర్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన ప్రొద్దుటూరు నాగేశ్వర రావు తమ పంట పొలాలకు రామన్న చెరువు అలుగు నీటినీ మళ్ళింపు చేసి నష్టం చేస్తున్నారని, నష్టం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్వో ఏ. పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బడిఈడు పిల్లలకు అక్షరాభ్యాసం

**గార్ల, నవభూమి, జూన్ 16:** అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం గార్ల మండలం గుండెళ్ళ గూడెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం లో నూతనంగా చేరిన పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఉషా రాణి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులు ఉన్నతులుగా ఎదిగేందుకు అంగన్వాడీ కేంద్రాలు ఎంతో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు అందనాల రాజీవ్ నాయుడు,



అంగన్వాడీ కార్యకర్తలు సుజాత, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతిలో భూముల సమస్యలు పరిష్కరించాలి



**గార్ల, నవభూమి, జూన్ 16:** భూ భారతి గ్రామసభల్లో దరఖాస్తు దారుల భూ సమస్యలతో పాటు అన్ని వర్గాల రైతుల దరఖాస్తులను స్వీకరించాలని డిమాండ్ చేస్తూ న్యూ డెమోక్రసి పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మండలం పరిధిలోని అయా గ్రామాలకు చెందిన రైతులు గార్ల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నా నుద్దేశించి న్యూ డెమోక్రసి మండల కార్యదర్శి జి. సక్రు మాట్లాడుతూ రెవిన్యూ సదస్సులో దరఖాస్తుల స్వీకరణ తప్ప పరిష్కారం చూపక పోగా గిరిజనేతరుల దరఖాస్తులను నిరాకరించడం సరైన విధానం కాదన్నారు. దరఖాస్తు చేసుకొన్న ప్రతి రైతుకు రశీదు అందించి భూముల సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయాలని ధర్నా



**గార్ల, నవభూమి, జూన్ 16:** రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం రైతులు గార్ల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నా నుద్దేశించి పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టె బోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున పాత రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బోనస్ విడుదల చేయాలని, రుణాల మంజూరు లో ఏలాంటి షరతులు విధించి వద్దని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రాగం రమేష్, సింగు రమేష్, భీముడు, పిచ్చయ్య, బిక్షం, వెంకటేశ్వర్లు, ఉపేందర్ రెడ్డి, సక్రు, తదితరులు పాల్గొన్నారు.

# వైర్లెస్ చార్జింగ్ రంగంలో భావ్ సింగ్‌కు డాక్టరేట్

**గార్ల, నవభూమి, జూన్ 16:** ఎలక్ట్రిక్ వెహికిల్ అప్లికేషన్ కోసం ఇండక్టివ్ కపుల్డ్ వైర్లెస్ చార్జింగ్ అనే అంశంపై పరిశోధన చేసి విద్యుత్ వాహనాల అభివృద్ధికి మేలు కొల్పే దిశగా కృషి చేసిన గార్ల మండలం సీతంపేట గ్రామానికి చెందిన భావ్ సింగ్ కు ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్ యూనివర్సిటీ కాలేజ్



ఆఫ్ ఇంజనీరింగ్ నుండి డాక్టరేట్ పట్టా పొందారు. రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ స్, బాసర లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి అధిపతిగా పని చేస్తున్న భావ్ సింగ్ వైర్లెస్ చార్జింగ్ రంగంలో పరిశోధన చేశారు. ఈ పరిశోధన లో విజయం సాధించిన భావ్ సింగ్ కు హైదరాబాద్ లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు జి. సురేష్ బాబు, బి. మంగు మార్గ దర్శకత్వం చూపారు. హైదరాబాద్ లో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో భావ్ సింగ్ కు ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వాహకులు డాక్టరేట్ పట్టా ప్రదానం చెయ్యగా ప్రొఫెసర్లు గోవర్ధన్, మురళీధరేషన్ లు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా భావ్ సింగ్ మాట్లాడుతూ విద్యార్థులకు నూతన పరికల్పనలు పరిచయం చేయడం, పరిశోధనలతో సమాజానికి ఉపయోగపడే పరిష్కారాలు అందించడమే నా లక్ష్యమన్నారు.

# కమ్యునిస్టులతోనే హక్కుల సాధన

◆ సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు



**చింతకాని, నవభూమి, జూన్ 16:** దేశంలో కార్మికులు, కర్షకులు ప్రజలకు హక్కులు సాధించి పెట్టడంలో కమ్యూనిస్టు పార్టీలు కీలక పాత్ర పోషించాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. సోమవారం సిపిఐ చింతకాని మండల 17వ మహాసభ లచ్చగూడెం గ్రామంలో అమరజీవి బాల నాగేందర్ రెడ్డి ప్రాంగణంలో కూచిపుడి రవి, మార్గం శ్రీను,గుండ్ల బేబీ రాణి ల అధ్యక్షతన జరిగింది. తొలుత మహాసభల ప్రారంభ సూచికంగా ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని బాగం హేమంత రావు ఆవిష్కరించారు. అమర వీరుల స్మారక స్తూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బాగం హేమంతరావు మాట్లాడుతూ వందేళ్లుగా సిపిఐ, కమ్యూనిస్టు పార్టీలు దేశానికి ఏమి చేశాయని కొంత మంది అవివేకులు మాట్లాడుతున్నారని ఆయన తెలిపారు. భారతదేశ. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని స్వాతంత్ర్యం తర్వాత కూడా ప్రజల, కార్మికుల, కర్షకుల హక్కుల కోసం అనునిత్యం సిపిఐ పోరాటం చేస్తుందన్నారు. సిపిఐ తో పాటు ఇతర కమ్యూ నిస్టు పార్టీలు కలిసి పోరాటం చేయడం వల్లనే దేశంలో జమీందారులు, జాగీర్దారులు, పటేల్ పట్వారీ వ్యవస్థలు రద్దయ్యాయన్నారు. ఎంతో మంది భూములు లేని పేదలకు భూములు కల్పించిందన్నారు. ఏఐటియుసి ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితంగా 44 కార్మిక హక్కుల చట్టాలను కల్పించుకున్నారు. సిపిఐ ఆధ్వర్యంలో చేసిన పోరాటాలు అజరామరమన్నారు. ప్రస్తుత యువతకు కూడా కమ్యూనిస్టు పార్టీ అవశ్యకత గురించి తెలపాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో రాచరిక వ్యవస్థను నిర్మూలించడానికి నైజాం నిరంకుశ పాలనను పారద్రోలడానికి సిపిఐ అలుపెరుగని పోరాటం చేసిందన్నారు. కమ్యూ నిస్టు పార్టీ చేసిన పోరాటాలు నేటి యువత తెలుసుకోవాలన్నారు. పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధా నాలపై పోరాటాలు సాగించాలన్నారు. సిపిఐ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పేద ప్రజలకు ఇండ్లు కట్టించాలని మొట్టమొదటి సారి అసెంబ్లీలో ప్రస్తావించింది కమ్యూనిస్టులేనని ఆయన తెలిపారు. 1973లో ప్రతిపక్ష నేతగా ఉన్న సిపిఐ శాసన సభ్యులు మహ్మద్ రజబ్ధలీ పేదలకు ఇండ్లు కట్టుకోవడానికి ఐదువేలు మంజూరు చేయా లని అడగగా అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఒప్పుకున్నారన్నారు. అప్పుడు కమ్యూనిస్టులు అడిగిన ఐదువేల రూపాయల నుంచి ఇప్పుడు ఐదు లక్షల వరకు ఇల్లు కట్టు కోవడానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుందంటే అది కమ్యూనిస్టుల చలువేన న్నారు. 2006లో రైతులకు రుణమాఫీ చేయా లని బ్యాంకుల ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో 48 గంటల పాటు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తే అవహేళన చేశారని రైతులకు రుణమాఫీ ఎలా చేస్తారని ఎద్దేవా చేశారన్నారు. ఇప్పుడు రుణమాఫీ చేయడానికి ప్రభుత్వాలు ముందుకు వచ్చాయని ఆయన తెలిపారు. ప్రభుత్వ రంగ ఆస్తులు కార్పొరేట్ లకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. బీజేపీ హయాంలో మతోన్మాదం హెచ్చుమీరుతుందన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించడంలో మోడీ పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేయాలని లేని పక్షంలో కేసిఆర్ కు పట్టిన గతి పడుతుందన్నారు. ఆరుగ్యారెంటీలు రైతు రుణమాఫీ,రైతు భరోసా తక్షణమే అమలు చేయాలన్నారు. పంటల భీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేయాలన్నారు. ప్రజా సమస్యలపై సిపిఐ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి కొండపర్తి గోవిందరావు ,జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు సింగు నరసింహారావు, మేకల నరసింహారావు, సీతామాలక్ష్మి ,వ్యకాస జిల్లా కార్యదర్శి ఏసు , పార్టీ మండల కార్యదర్శి పావులూరు మల్లికార్జున రావు, జిల్లా సమితి సభ్యులు దూసరి శ్రీరాములు, రాసాల మోహన్ రావు బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, చింతకాని మండల సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్ , దూసరి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యదర్శిగా దూసరి గోపాలరావు చింతకాని మండల నూతన కార్యదర్శిగా దూసరి గోపాలరావు , సహాయ కార్యదర్శులుగా అబ్బూరి మహేష్, మార్గం శ్రీనుతో పాటు 48 మందితో నూతన కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

**ఖమ్మం క్రైం, నవభూమి జూన్ 16:** ట్రాఫిక్ నియమాలను పాటించడం అనేది వ్యక్తిగత భద్రతకు సంబంధించిన విషయం మాత్రమే కాకుండా సమాజానికి దోహదపడే మార్గమని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అన్నారు. రోజువారీ జీవితంలో ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత పై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రిక్కబజార్ స్కూల్ లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను విద్యార్థులకు చిన్న వయస్సులోనే నేర్పించడం వలన వారిలో క్రమశిక్షణతో పాటు సమాజంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం అలవారుతుందన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం వలన ట్రాఫిక్ సజావుగా సాగుతుందని, అదేవిధంగా రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. తద్వారా అందరికీ సురక్షితమైన వాతావరణాన్ని సృష్టించవచ్చున్నారు. అందులో భాగంగానే విద్యార్థులకు ట్రాఫిక్ రూరీల్స్ పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నగరంలోని ప్రధాన రహదారులు, కూడళ్ళ వద్ద ట్రాఫిక్ నియంత్రణకు పాటించాల్సిన నిబంధనలను ఏసిపి వారికి వివరించారు. ఇటీవల కాలంలో యువత నడుస్తున్నప్పుడు, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు సెల్ ఫోన్లు మాట్లాడుతూ తరచుగా పరధ్యానంలో ఉంటూ ప్రమాదాలకు గురవుతున్నారని గుర్తుచేశారు. హెల్మెట్లు, సీట్ బెల్టుల వంటి భద్రతా సామగ్రి వినియోగంతో డ్రైవర్లకు రక్షణ కవచాలుగా పనిచేస్తాయన్నారు. ముఖ్యంగా వేగ పరిమితులను పాటించడం, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఫోన్‌లను ఉపయోగించకపోవడం వంటి నియమాలు పాటిస్తే ప్రమాదాలను పూర్తిస్థాయిలో నివారించవచ్చున్నారు. ఈ సదస్సులో ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ, ఆర్ ఐ సాంబశివరావు, ఎస్సై రవి, రాము పాల్గొన్నారు.







# సొసైటీలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి



**జూలూరుపాడు, జూన్ 16 (నవభూమి ప్రతినిధి)** మండల రైతాంగానికి శుభవార్త స్థానిక సొసైటీ కార్యాలయంలో బి పి టి రకానికి చెందిన వరి 5204 విత్తనాలు మంగళ వారం నుంచి విక్రయించనున్నట్లు సొసైటీ అధ్యక్షులు చీమలపాటి బిక్షం ఒక ప్రకటనలో వెల్లడించారు. 400 బ్యాగుల విత్తనములు సిద్ధంగా ఉన్నాయి. ఒక్కొక్క బ్యాగు 25 కేజీలు బరువు కలిగి ఉంటుంది. బ్యాగు ధర రూ. 1075 చొప్పున విక్రయించబడునని తెలిపారు. విత్తనములు కావలసిన వారు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకము జిరాక్స్ ప్రతులు ఫోన్ నెంబరు సమర్పించి పొందవచ్చు, ఈ సదవకాశాన్ని రైతులు వినియోగించ వలసినదిగా విజ్ఞప్తి చేశారు.

# కొత్తగూడెం ఏరియాలో పర్యటించిన చీఫ్ లైసన్ ఆఫీసర్





**కొత్తగూడెం జూన్ 16 నవభూమి ప్రతినిధి:** సింగరేణి సంస్థ ఎస్సి ఉద్యోగుల చీఫ్ లైసన్ ఆఫీసర్ మణుగూరు ఏరియా జిఎం. డి. రామచందర్ ఆధ్వర్యంలో ఎస్సి కమిటీ సోమవారం రోస్టర్ రిజిస్టర్ వెరిఫికేషన్ కోసం కొత్తగూడెం ఏరియా జిఎం కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భముగా కొత్తగూడెం ఏరియా యాక్టింగ్ జిఎం ఎం. రమేష్ పుష్పగుచ్ఛం ఇచ్చి వారికీ స్వాగతం పలికారు. అనంతరం చీఫ్ లైసన్ ఆఫీసర్ డి. రామచందర్, రోస్టర్ పాయింట్ వెరిఫికేషన్ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఎస్సి ఉద్యోగులకు పదోన్నతులకు సంబంధించిన రోస్టర్ పాయింట్ రిజిస్టర్ లను తనిఖీ చేసి రోస్టర్ రూల్ ప్రకారం పదోన్నతులు జరుగుతున్నాయో లేదో అని సంబంధిత అధికారులతో సమీక్షించి రోస్టర్ రిజిస్టర్ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా డిజిఎం(పర్సనల్) గామలపాటి వెంకట మోహన్ రావు అన్నీ వివరాలను అందించారు. ఈ కార్యక్రమములో ప్రెసిడెంట్ డాక్టర్ ఈ. రాజేశ్వర్, వైస్ ప్రెసిడెంట్ ఎం. వేంకటేశ్వర రావు, జనరల్ సెక్రెటరీ అంతోటి నాగేశ్వర రావు, కొత్తగూడెం ఏరియా లైసెన్ ఆఫీసర్ కలువల చంద్రశేఖర్, యాక్టింగ్ జిఎం ఎం. శ్రీ రమేష్, డిజిఎం(పర్సనల్) గామలపాటి వెంకట మోహన్ రావు, డివై పిఎం గోవర్ధన హరీష్, సీనియర్ పిఓలు మజ్జి.మురళి, మొహమ్మద్ మాథీన్ హుస్సైన్, సెంట్రల్ కమిటీ మెంబర్స్ పోనగంటి అంకుస్, బందెల విజేందర్, జే. మల్లేష్, రొంటల సురేష్, ఎన్.శ్రీనివాస్, ఎం. రామకృష్ణ, కే.ఆంజనేయులు, బి. వెంకటేశ్వర్లు, ఇతర కమిటీ సభ్యులు ఉన్నారు.

# యోగా శిక్షణా తరగతులు

**కొత్తగూడెం జూన్ 16 నవభూమి ప్రతినిధి:** జూన్ 21 వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వము కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు కోల్ ఇండియా అనుబంధ బొగ్గు సంస్థల్లో ఈ నేల 14 నుండి 20 వరకు నిర్వహించే యోగా బూట్ క్యాంపుల నిర్వహణ లో భాగముగా సోమవారం నాడు సింగరేణి ప్రధాన కార్యాలయములోని హెచ్ఆర్డి కాన్ఫరెన్స్ హాల్, కార్పొరేట్ లోని అన్ని డిపార్ట్మెంట్ ల నందు ఉద్యోగులకు యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ఉదయం సింగరేణి ప్రధాన కార్యాలయము లో కార్పొరేట్ పరిధిలోని మెగా యోగా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ యోగా బూట్ కార్యక్రమములో కార్పొరేట్ పరిధిలోని అన్ని డిపార్ట్మెంట్ల అధికారులు, ఉద్యోగులు యోగా మాస్టర్లు పాల్గొన్నారు.



# దేశాభివృద్ధే ధ్యేయంగా మోడీ పాలన

**ఖమ్మం, నవభూమి జూన్ 16:** దేశాభివృద్ధి ద్యేయంగా దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ పాలన నడుస్తుందని దేశంలోని అన్ని వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు కేంద్ర ప్రభుత్వం అందిస్తూ వారి అభ్యున్నతికి పాటుపడుతుందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు అన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని 3 టౌన్ ప్రాంతం శ్రీనివాస్ నగర్ లో వెంకట సాయి ఫంక్షన్ హాల్ నందు నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పాలనలో సంక్షేమం అభివృద్ధి సంబంధించిన అంశాలపై ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు బిజెపి త్రీ టౌన్ అధ్యక్షురాలు దార్ల మల్లేశ్వరి శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో నెల్లూరు కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ 11 సంవత్సరాల పాలనలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఒకవైపు సంక్షేమ పథకాలు పేదలందరికీ చిట్టచివరి వరకు అందుతున్నాయని అదేవిధంగా దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. దేశ రక్షణ విషయంలో కూడా భారత సైన్యానికి స్వేచ్ఛనిచ్చి వారికి అండగా నిలిచి పాకిస్తాన్ కు గట్టిగా గుణపాఠం చెప్పి దేశ ప్రజలకు భరోసా ఇచ్చి ప్రపంచానికి భారత్ దేశం యొక్క సత్తాను తెలుపుతూ భారతదేశం ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక దేశంగా ఏర్పడటానికి కృషి చేశారని అన్నారు. అనంతరం 3 టౌన్ ప్రాంతంలోని టిఆర్ఎస్, సిపిఎం నుంచి 60 కుటుంబాలు బిజెపిలో చేరారు. వేముల వెంకటేష్ వారి మిత్ర బృందానికి బిజెపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గుత్త వెంకటేశ్వర్లు, పిట్టల వెంకట నరసయ్య , రుద్ర ప్రదీప్, కొణతం లక్ష్మీనారాయణ, నల్లగట్టు ప్రవీణ్, పమ్మి అనిత, ఈదుల భద్రం, నెల్లూరు బెనర్జీ, రేఖా సత్యనారాయణ యాదవ్, వీరవెల్లి రాజేష్, రాఘవ గౌడ్, గోనెల శివ, శ్రీరామనేని మణి, రజినీ రెడ్డి, శంకర్ గౌడ్, డోన్వాన్ దాసు తదితరులు పాల్గొన్నారు.



# కులగణనలో ముస్లింలకు అన్యాయం

◆ **మైనారిటీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు యాకుబ్ పాషా**

**పాల్వంచ జూన్ 15 నవభూమి ప్రతినిది:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది చేపట్టిన కుల గణన సర్వేలో ముస్లిం జనాభా గణాంకాల్లో తీవ్ర అవకతవకలు జరిగాయని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ. యాకూబ్ పాషా ఆరోపించారు. సోమవారం జిల్లా సంఘ కార్యాలయం లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ 2011లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వే ప్రకారం తెలంగాణలో ముస్లిం జనాభా 44,64,852 గా ఉండగా, 2024లో రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన సర్వేలో ఈ సంఖ్య 44,57,012గా మాత్రమే చూపించడం విస్మయకరమని ఆయన పేర్కొన్నారు. 13 సంవత్సరాల వ్యవధిలో జనాభా పెరగకపోగా, సుమారు 7,840 మంది ముస్లిం జనాభా తగ్గిపోయినట్లు సర్వే గణాంకాలు చూపడంపై యాకూబ్ పాషా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జనాభా ఎక్కడైనా పెరుగుతుంది కానీ తగ్గడం ఏమిటి? ఈ తప్పిదాలను కప్పిపుచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్వే వివరాలను బహిర్గతం చేయడం లేదు అని ఆయన అధికారులు, నాయకులను ప్రశ్నించారు. ముస్లిం జనాభా గణాంకాల తగ్గింపు వల్ల స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్లింలకు రిజర్వేషన్ సీట్ల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2011 కేంద్ర ప్రభుత్వ సర్వే ఆధారంగా మైనారిటీ సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించబడుతుండగా, తాజా సర్వే ఫలితాలు ఈ పథకాలపై ప్రభావం చూపవచ్చని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కుల గణన సర్వే నివేదికలకు బదులుగా, కేంద్ర ప్రభుత్వం 2011 సర్వే ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించాలని యాకూబ్ పాషా కోరారు. ముఖ్యమంత్రి ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, తగ్గిన ముస్లిం జనాభా గణాంకాలపై సమాధానం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ముస్లిం సమాజానికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన ఉద్ఘాటించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు హుస్సేన్ ఖాన్, సలీం, ఆసిఫ్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.



## టియుసిఐ రాష్ట్ర ప్రథమ

# మహాసభలను జయప్రదం చేయండి

**జిల్లా ఉపాధ్యక్షులు గోనెల రమేష్**

**పాల్వంచ జూన్ 15 నవభూమి ప్రతినిది:** ఈ నెల 21, 22 న నిజామాబాద్ లో జరిగే టీ యు సి ఐ రాష్ట్ర ప్రథమ మహాసభ లను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షులు గోనెల రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కే జీ బి వి హాస్టల్ లో అందుకు సంబందించిన వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా టి యు సి ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రమేష్ మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీలలో నిజామాబాద్ లో టియుసిఐ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని, 21 వ తారీకు భారీ కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ, 22వ తారీకు ప్రతినిధుల సభ జరుగుతుందని, దీనికి టి యు సి ఐ ఆల్ ఇండియా అధ్యక్షులు అమ్రిస్ పటేల్ హాజరవుతారని ఈ బహిరంగ సభకు అన్ని రంగాల కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. అసంఘటిత రంగ కార్మికులు చాలీ,చాలని వేతనాలతో పనిచేస్తూ వారి కుటుంబ పోషణ భారమై ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అన్ని రంగాల అసంఘటితరంగ కార్మిక వర్గానికి అనేక హామీలను ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలను విస్మరిస్తుందని విమర్శించారు. కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులంతా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది అచ్చమ్మ, సుశీల, కమలమ్మ, లక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.



## నూతన డైరెక్టర్ పా గౌతమ్ పోట్రుకు సన్మానం



**కొత్తగూడెం జూన్ 16 నవభూమి ప్రతినిధి:** సింగరేణి కాలరీస్ బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున నూతనంగా డైరెక్టర్ పా బాధ్యతలు చేపట్టిన శ్రీ గౌతమ్ పోట్రు ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఏ. నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ ఎన్. రమేష్, జాయింట్ సెక్రటరీ ప్రకాష్, సెంట్రల్ కమిటీ మెంబర్ తిమ్మిరి నరేంద్రబాబు, ట్రెజరర్ కోల హరీష్ పాల్గొన్నారు.అలాగే కార్పొరేట్ లైసెన్ ఆఫీసర్ మురళి, డిజీఎం డా. శశికిరణ్, కార్పొరేట్ అసోసియేషన్ నాయకులు రామకృష్ణ, రామచందర్, సుధాకర్, శ్యామల రవి, నరేందర్, కమల్, శంకర్, చింతకింద శ్రీనివాస్, నరసింహారావు, ప్రియాంక, ఆశ, నిషా తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బెటర్మెంట్ ఫలితాలలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన సింధు



**ఎర్రుపాలెం,నవభూమి,జూన్ 16:** రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం విడుదలైన ఇంటర్మీడియట్ బెటర్మెంట్ మొదటి సంవత్సరం ఫలితాలలో జమలాపురం గ్రామానికి చెందిన అయినం సింధు తెలంగాణ స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. గత నెలలో ప్రకటించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష ఫలితాలలో 464 మార్కులే వచ్చాయని బెటర్మెంట్ పరీక్షలు రాయగా 470 మార్కులకి468 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది.సింధు ఖమ్మం పట్టణంలోని వెలాసిటీ కాలేజీలో చదువుతుంది.సింధు సోదరి హారికకూడా ఖమ్మంలోనివెలాసిటీకాలేజీలోచదువుతూ ఇంటర్ మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాల్లో స్టేట్ మూడవ ర్యాంకు సాధించింది.వీరిద్దరు కూడా 10వ తరగతి ఫలితాల్లో స్టేట్ఫస్ట్ ర్యాంకులు సాధించారు .వీరి తండ్రి గంగాధర్ రావు జమలాపురం లో ఒక సామాన్యమైన ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్నారు.తల్లిశ్రీలక్ష్మి జమలాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో స్వీపర్ గా విధులు నిర్వహిస్తూ తామపడ్డ కష్టాలు తమ పిల్లలకు ఉండకూడదనే లక్ష్యంతో ఇద్దరూ ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివే విధంగా తీర్చిదిద్దారు. ఈరోజు సింధు సాధించిన ఫలితాలతో జమలాపురం గ్రామస్తులు సింధును, తల్లిదండ్రులను కొనియాడుతూ వారికి అభినందనలు తెలిపారు.

## సంక్షేమ బోర్డును కార్మిక శాఖ నిర్వహించాలి

### ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్



**కొత్తగూడెం జూన్ 16 నవభూమి ప్రతినిధి:** తెలంగాణ భవన నిర్మాణం కార్మిక సంక్షేమ బోర్డును ప్రైవేటీకరణ ఆపాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల మల్లికార్జున్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జాయింట్ కలెక్టర్ డి వేణుగోపాల్, జిల్లా లేబర్ కమిషనర్ ఎండి షర్ఫుద్దీన్ లకు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పలు రకాల సమస్యలు చూపి ప్రైవేటీకరణ చేసేందుకు ఈ నెల నాలుగో తారీఖున నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఈ నోటిఫికేషన్ను పోరాటాలతో అడ్డుకుంటామని కార్మిక శాఖ ఆధ్వర్యంలోనే సంక్షేమ బోర్డు నిర్వహించాలని కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తే శాఖ అధికారులపై భారం పడదని సస్సును ఒకటి నుండి రెండు శాతానికి పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోరికృష్ణ, జిల్లా నాయకులు దారావత్ గోపి నాయక్, పెనుమడి పున్నయ్య, జన్నోజు శంకరాచారి తదితరులు పాల్గొన్నారు


## వ్యాపార విస్తరణ ప్రాజెక్టుల్లో

# మరింత వేగం పెరగాలి

- సోలార్, పవన, జియో థర్మల్ విద్యుత్తు, బొగ్గు నుంచి కెమికల్స్ పై ప్రత్యేక సమీక్ష
- పనులు మందకొడిగా సాగితే ఉపేక్షించేది లేదు
- అన్ని విభాగాల అధిపతులకు సీఎండీ ఎన్.బలరామ్ హెచ్చరిక
- 28 రకాల విస్తరణ ప్రతిపాదనలపై సుదీర్ఘంగా సమీక్షించిన ఛైర్మన్



**కొత్తగూడెం జూన్ 16 నవభూమి ప్రతినిధి:** సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా చేపట్టిన ప్రాజెక్టులను, పనులను మరింత వేగవంతంగా నిర్వహించాలని, మందకొడిగా పనులు కొనసాగితే ఉపేక్షించేది లేదని సీఎండీ ఎన్.బలరామ్ వివిధ విభాగాల అధికారులను హెచ్చరించారు. హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి సోమవారం నిర్వహించిన వీడియో సమావేశంలో సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా చేపట్టిన సోలార్ విద్యుత్, పవన విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్, జియో థర్మల్ విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, కీలక ఖనిజాల ఉత్పత్తి, జాయింట్ వెంచర్ల ఏర్పాటు, కార్బన్ డయాక్సైడ్ నుండి మిథనాల్ తయారీ, సర్ఫేస్ కోల్ గ్యాసిఫికేషన్, భూగర్భ గనుల్లో కోల్ గ్యాసిఫికేషన్ తదితర 28 రకాల ప్రాజెక్టులు, పనులపై ఆయన సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని ప్రాజెక్టులపై ఇప్పటికే ప్రాథమిక అవగాహనకు రావడం, కొన్ని పనుల పట్ల ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగిందని, మరికొన్ని పనులపై ఏజెన్సీల ద్వారా అధ్యయనం జరుగుతుందని, సింగరేణి సంస్థకు ఈ వ్యాపార విస్తరణ చర్యలు ఎంతో అవసరం కనుక ఈ పనులను మరింత వేగవంతంగా నిర్వహించాలని ఆయన కోరారు. వివిధ విభాగాల వారు తమకు కేటాయించిన పనులపై వివరించగా ఆయన పనులలో జరుగుతున్న జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. మరో 10 రోజులకల్లా ప్రతీ పనిలో ప్రగతి కనిపించాలన్నారు. ఇకపై ప్రతీ వారం బొగ్గు ఉత్పత్తిపైనే కాకుండా ప్రత్యేకంగా వ్యాపార విస్తరణ ప్రాజెక్టులపై సమీక్ష ఉంటుందని స్పష్టంచేశారు. సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు కూడా సింగరేణి వ్యాపార విస్తరణ చర్యల పట్ల సానుకూల ధోరణితో ఉన్నాయని, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వ్యాపార విస్తరణ చర్యలు త్వరగా అమలులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ఇంకా కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకు కార్యాలయాలు, క్వార్టర్ల పైన చేపట్టాల్సిన రూఫ్ టాప్ సోలార్ పవర్ గురించి, కోల్ వాషరీల ఏర్పాటు, హైడ్రాలిక్ కన్వేయర్ల ఏర్పాటు వంటి విషయాలపై లోతుగా





చర్చించారు. సమావేశంలో డైరెక్టర్ ఈ అండ్ ఎం డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ పర్సనల్ గౌతమ్ పొట్రు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ శ్రీ ఎస్.డి.ఎం సుభాని, ఇంకా జీఎం సి.పి.పి ఎ.మనోహర్, జీఎం మార్కెటింగ్ ఎన్. వి.రాజశేఖర్ రావు, సింగరేణి థర్మల్ పవర్, సోలార్ పవర్, రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్, సింగరేణి సివిల్, బిజినెస్ డెవలప్ మెంట్, తదితర 20 శాఖల జనరల్ మేనేజర్లు కూడా పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్





**పాల్వంచ టౌన్ జూన్ 16 నవభూమి ప్రతినిధి:** ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ వారి ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ అంటే సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు సమాజ సేవా కార్యక్రమాలు చేసే కార్యక్రమాన్ని డాన్ టు డస్క్ అంటారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిరుపేదలైన పేషెంట్లకు షుగర్ టెస్టులు విజయ కేర్ హాస్పిటల్ డాక్టర్స్ గోపి నందన్ అనూష లక్ష్మి వారి సహకారంతో సోమవారం అందించారు. అదేవిధంగా శిశు మందిర్ స్కూల్ కి ఒక నీటి ట్యాంకు, మరియు ఆ స్కూల్లో చదువుతున్న చిన్నారులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. మరియు ఐదుగురికి నిత్యవసర వస్తువులు బియ్యం, పప్పు, ఉప్పు, మంచి నూనె,వాసవి క్లబ్ నాయకులు చుండూరి శ్రీనివాసరావు సహకారంతో ఐదు కిట్ లు అందించారు. అలానే ఒక రైతుకు సన్మానం చేసి ఒక బేషన్, పార పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బండారు వెంకటేశ్వరరావు, ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, రేపాక రాజ మనోహర్,పాల్గొన్నారు.చాంబర్ ఆఫ్ కామర్స్ కన్వీనర్ చలవాది ప్రకాష్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ పెండ్యాల రోజులక్ష్మి, ఇంటర్నేషనల్ నాయకులు ధారా నరసింహారావు, మిరియాల నాగశ్రీలత, వాసవి క్లబ్ వనిత వాసవి క్లబ్ ప్రెసిడెంట్, సంక సర్వేష్ సెక్రటరీ, దారా శంకర్, వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ సంక రమ,సెక్రటరీ దారా మాధవి, ట్రెజరర్ దొంతు మౌనిక, వాసవి వనిత క్లబ్ వైస్ ప్రెసిడెంట్ వంకధార ఇందిరా, మధు, ఇందిరా పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రులలో కలెక్టర్ చొరవతో మిషన్ శానిటేషన్ ప్రారంభం



**కొత్తగూడెం జూన్ 16 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పారిశుధ్య పనులను మరింత సులభతరం చేయడానికి కలెక్టర్ వినూత్నమైన మెషిన్ శానిటేషన్ అమలు చేయించారు. ఈ డీఎంఎఫ్ నిధుల ద్వారా అవసరమైన యంత్రాలను కొనుగోలు, చేయించారు. స్క్రబ్బింగ్ మెషిన్, మాన్యువల్ స్వీపర్ హై ప్రెషర్ వాషర్, ఈ యంత్రాలు వినియోగంలోకి వచ్చాయి. దీంతో ఆసుపత్రిలో పారిశుధ్య ప్రమాణాలు మరింత మెరుగవ్వడం తో పాటు, కార్మికుల శ్రమ తగ్గుతుంది. రోగులకు శుభ్రమైన వాతావరణం అందుతుంది. ఈ సందర్భంగా జి జి హెచ్ కొత్తగూడెం తరఫున సూపరింటెండెంట్ కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## రైతునేస్తంతో రైతు సమస్యల పరిష్కారం: ఏవో



**ఎర్రుపాలెం,నవభూమి,జూన్ 16:** రైతు నేస్తం కార్యక్రమంతో రైతుల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఏవో సాయి శివ తెలిపారు.రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో సోమవారం అనుసంధానం ప్రారంభోత్సవ కార్యక్రమాన్నిరాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిచే ప్రారంభించడం జరిగిందని ఏవో తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా 1031 రైతు వేదికల నుంచి ప్రత్యక్ష ప్రసారం చేయబడిందని,మండల పరిధిలోని ఎర్రుపాలెం, మీనవోలు,జమలాపురం క్లస్టర్ రైతు వేదికల నందు ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం ఆయా క్లస్టర్ వ్యవసాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో అధికారులు,ప్రజా ప్రతినిధులు,నాయకులు,రైతులుపాల్గొన్నారు. ఎర్రుపాలెం రైతు వేదికలో జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్ లో తహసిల్దార్ మన్నె ఉష శారద,ఆర్ఐ లు రవికుమార్, రాజశేఖర్,రెవెన్యూ సిబ్బంది,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి,బండారు నరసింహారావు, అనుమోలు కృష్ణారావు,క్లస్టర్ రైతులు, మీనవోలు వీడియో కాన్ఫరెన్స్ లో ఐలూరు వెంకటేశ్వర రెడ్డి,రైతులు, జమలా పురం వీడియో కాన్ఫరెన్స్ లో రాజుపాలెం సొసైటీ అధ్యక్షులు వెన్నపూస కృష్ణారెడ్డి,మాజీ చైర్మన్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి,గద్దె నాగేశ్వరరావు,వేముల రమేష్, నన్నపనేని నారాయణరావు,రాబర్ట్,తది తరరైతులు,ఏఈఓవంశీకృష్ణపాల్గొన్నారు. ముఖ్యమంత్రి రైతులతో ముఖాముఖి నిర్వహించిన కార్యక్రమంలో కొంతమంది రైతుల నుంచి వ్యవసాయ పంటల సాగు వివరాలు,వరి పంట బోనస్ వివరాలు, రుణమాఫీ పథకాల లబ్ధిగురించి రైతులు తెలుసుకున్నారు.

## మావోయిస్టుల ప్రభావానికిలోను కావద్దు

### గొత్తి కోయ గ్రామాన్ని సందర్శించిన పాల్వంచ సిఐ

**పాల్వంచ జూన్ 15 నవభూమి ప్రతినిది:** మావోయిస్టుల ప్రభావానికి లోను కావద్దని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి సహకరించవద్దని పాల్వంచ సీఐ సతీష్ కుమార్ సూచించారు. సోమవారం పాల్వంచ మండలం లోని రాళ్లచెలక, గొత్తి కోయ గ్రామాన్ని ఆయన స్థానిక ఎస్సై సురేష్ తో కలిసి సందర్శించారు. ఇన్ ఫార్మర్ అనే నేపంతో అమాయకులైన గిరిజనులను హతమారుస్తున్న మావోయిస్టులకు సహకరించవద్దని సూచించారు. మావోయిస్టుల సమాచారం తెలిసినా, వారి కదలికలపై అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామస్తులు ఎవరికైనా ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల సహకారం తీసుకుని వాటిని పరిష్కరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రశాంతంగా లారీ ఓనర్స్

# వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు

- ఎనిమిది ఓట్ల మెజారిటీతో అధ్యక్షునిగా అనిల్ కుమార్ ఎన్నిక
- అభినందించిన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా





**కొత్తగూడెం జూన్ 16 నవభూమి ప్రతినిధి:** రాజకీయ జోక్యం, వివాదాలు అసోసియేషన్ ఎన్నికల నిర్వహణకు అడ్డంకిగా మారడంతో స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని ప్రత్యేక చొరవతో ఎట్టకేలకు సోమవారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా నియమించబడిన ప్రభుత్వ సొసైటీ అధికారి పర్యవేక్షణలో పట్టణంలోని ఇండియన్ మెడికల్ అస్సోసిల్ హాల్లో ఉత్కంఠభరితంగా ది సింగరేణి టిప్పర్స్ అండ్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. అసోసియేషన్ అధ్యక్ష పదవికోసం జరిగిన ఎన్నికల్లో బూర్గుల అనిల్ కుమార్ 8 ఓట్ల మెజారిటీతో తానంగి రవికుమార్ పై గెలుపొందారు. మొత్తం 112 ఓట్లకు గాను 109 ఓట్లు పోలవగా ఒక ఓటు చెల్లలేదు. అధ్యక్షుడిగా ఎన్నికైన అనిల్ కుమారుకు 58 ఓట్లు పోలయ్యాయి, రెండో స్థానంలో నిలిచినా తానంగి రవికుమారుకు 50 ఓట్లు పోలయ్యాయి. అనిల్ కుమార్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించి ధ్రువపత్రం అందజేశారు, రెండేళ్లపాటు అసోసియేషన్ అధ్యక్షుడిగా అనిల్ కుమార్ కొనసాగనున్నారు.సమిష్టి నిర్ణయాలతో కార్యకలాపాలు నిర్వహించాలి: సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా సభ్యుల అందరి ఆమోదం, సమిష్టి నిర్ణయాలతో లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యకలాపాలు నిర్వహించుకోవాలని, ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా అసోసియేషన్ సభ్యుల సమస్యల పరిస్కారంకోసం కలిసికట్టుగా కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. అధక్షునిగా ఎన్నికైన అనిల్ కుమార్, రెండో స్థానంలో నిలిచిన రవికుమార్ తమ మద్దతుదారులతో సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనిల్ కుమారుని, రవికుమారును పూలమాల, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. గెలుపొందిన రవికుమారుకు శుభాకాంక్షలు తెలిపారు. గెలుపోటములు ఎన్నికలవరకే పరిమితం చేసి పరస్పర సహకారంతో అస్సోసియేషనును ముందుకు తీసుకుపోవాలని, ఎలాంటి సమస్యలున్నా స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యపద్ధతిలో ఎన్నికలు జరిగాయని, ఎలాంటి రాజకీయ ప్రమేయంలోకుండా స్వయం ప్రతిపత్తితో అస్సోసియేషన్ను నడిపించాలని, ఆర్ధిక లావాదేవీల విషయంలో ఎలాంటి అవినీతికి తవ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు గానగళ్ల వీరస్వామి, రుద్రంపూర్ సిపిఐ శాఖా కార్యదర్శి తోట రాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం భూమి కవులు

# బహిరంగ వేలం ప్రకటన

**పాల్వంచ టౌన్ జూన్16 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మండలం, పాత పాల్వంచ గ్రామములో వెలిసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఈ స్వామి వారి హక్కు భుక్తములోని చింతలచెరువు ఆయకట్టు క్రింద మాగాణి భూమి సర్వే నెంబర్ 52,69 లో ఎకరం 2.30 గుంటల భూమిని ఒక(1) సంవత్సరానికి(2) పంటలు(వర్షాకాలం, వేసంగి ) పండించుకొనుటకు బహిరంగ వేలం తేదీ 20-06-2025, శుక్రవారం ఉదయం 9.00 గంటలకు నిర్వహించనున్నారు. ఈ వేలంలో పాల్గొనే రైతులు ఈ దిగువ తెలిపిన షరతులను చదువుకొని పూర్తి అంగీకారంతో బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని కార్యనిర్వహణాధికారి ఎన్. రజిని కుమారి తెలిపారు. బహిరంగ వేలం పాట షరతులు 1) సదరు వేలం పాటలో లు పాల్గొనే రైతులు ముందుగా రూ.5000లు డిపాజిట్ సొమ్ము చెల్లించి తర్వాత పాటలో పాల్గొనాలని,2) పాత బకాయి ఉన్నవారు పాటలో పాల్గొనుటకు అనర్హులు,3) ఈ కౌలు పాట ఒక్క సంవత్సరం అనగా రెండు పంటలు ( వర్షాకాలం, వేసంగి ) సేద్యం చేసుకొనుటకు మాత్రమే వర్తిస్తుందని,4) పాటలో పాల్గొనే రైతులు పొలం సరిహద్దులను( గెట్లను) సరిగా చేసుకుని పాటలో పాల్గొనాలన్నారు. పాట అనంతరం ఏ విధమైన అభ్యంతరాలు కోరినప్పటికీ చల్లదన్నారు. 5) హెచ్చు పాట దారుడు తను కట్టిన డిపాజిట్ సొమ్ము పోను పాడిన హెచ్చుపాట మొత్తంలో సగం (50 శాతం) సొమ్ము 30 రోజులలో దేవస్థానం వారికి చెల్లించి, రసీదు పొందాలన్నారు. ఈ విధంగా చెల్లించని యెడల అట్టి హెచ్చుదారుని అనర్హుడిగా పరిగణించి, ఈ పాటను రద్దుచేసి కట్టిన డిపాజిట్ సొమ్మును దేవస్థానం నిధులలో జమ చేసి తిరిగి వేలం పాట నిర్వహించనున్నారు. 6) హెచ్చు పాట దారుడు మిగిలిన సగం( 50 శాతం) సొమ్మును వర్షాకాలం పంట తరువాత చెల్లించి దేవస్థానం వద్ద నుండి రసీదు పొందాలన్నారు. 7) అతివృష్టి, అనావృష్టి మొదలగు ప్రకృతి వైపరీత్యాల వలన కలుగు లాభనష్టాలకు దేవస్థానం వారికి ఎటువంటి సంబంధం లేదన్నారు. 8) సదరు భూమిలోఉన్న చెట్టు కొట్టడం,తవ్వకాలు, ఇతరత్రా పనులు ఏమి చేయకూడదని, కౌలు గడువు ముగిసిన వెంటనే దేవస్థానం వారికి సదరు భూమిని అప్పగించాలన్నారు. 9) సదరు బహిరంగ వేలం పాట దేవాదాయ - ధర్మాదాయ శాఖ చట్టం 30/87 ప్రకారం కమిషనర్ ఉత్తర్వులకు లోబడి ఉండాలన్నారు. 10) ఈ వేలం పాటలు దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో, దేవస్థాన కార్యనిర్వహణాధికారి చే నిర్వహించనున్నారు. మరియు పాట నిర్వహించే సమయాల్లో దేవస్థాన ఆదాయం నిమిత్తం కొత్త షరతులను చేర్చుటకు, పాతవి తీసివేయుటకు కార్యనిర్వణాధికారికి సంపూర్ణ అధికారం ఉంటుందన్నారు. 11) ఏ కారణం తెలుపకనే ఈ బహిరంగ వేలం పాటను వాయిదా వేయుటకు గానీ, రద్దు పరుచుటకు గానీ కార్యనిర్వహణాధికారి కి పూర్తి అధికారం ఉందన్నారు. 12) మిగతా షరతులను పాట సమయంలో తెలియచేస్తామని దేవస్థాన కార్య నిర్వహణాధికారి ఎన్. రజినీ కుమారి తెలిపారు. ఈనెల 20న ఆలయంలో బహిరంగ వేలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పాత పాల్వంచలో వెలిసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 20న శుక్రవారం ఉదయం 9.00 గంటల నుండి చింతల చెరువు ఆయకట్టు మాగాణి భూమి సర్వేనెంబర్ 52,69 వింబుమలె 2.30 ఎకరములు లో వర్షాకాలం పంట సేద్యం చేసుకొనుటకు బహిరంగ వేలం ద్వారా నిర్వహించనున్నారు. ఆసక్తి గల రైతులు వేలంపాటలో పాల్గొనుటకు ముందుగా రూ.5000లు డిపాజిట్ గా చెల్లించి తదుపరి పాటలు పాల్గొనాలని దేవస్థాన కార్య నిర్వహణ అధికారి ఎన్. రజిని కుమారి తెలిపారు.

## స్పృహలేని వృద్ధుడిని ఆదుకున్న సేవా సంస్థ





**రుద్రంపూర్ జూన్ 16 నవభూమి:** పెనగడప గ్రామ శివారులోని శివాలయం సమీపంలో స్పృహతగ్గిన స్థితిలో పడి ఉన్న వృద్ధుడిని గుర్తించిన కొందరు గ్రామస్తులు మానవతా భావంతో స్పందించి సమాచారం సేవా సంస్థ ప్రతినిధి గూడెల్లి యాకయ్యకు అందించారు.సుమారు 70 ఏళ్ల వయస్సు ఉన్న ఆ వృద్ధుడు మసితో మసిపోయిన బట్టలు ధరించి ఉండగా, నెత్తి, గడ్డం విపరీతంగా పెరిగి ఉండటం గమనార్హం. స్పృహ కోల్పోయిన ఆయనను చూసిన స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు.సూచన అందుకున్న వెంటనే సేవా సంస్థకు చెందిన యాకయ్య, డి. శ్రీనివాస్ ఆటోలో సంఘటన స్థలానికి చేరుకుని వృద్ధుడిని పరిశీలించారు. ఆయన కాళ్లపై రెండు చోట్ల పాతగాయాలు ఉండటంతోపాటు, దుర్గంధం వస్తుండటం, పురుగులు పడటం వంటి దుస్థితి ఆ వ్యక్తి ఎదుర్కొంటున్న బాధను సూచించాయి.వృద్ధుడి గాయాలను శుభ్రపరచి, కట్టులు వేసి, ప్రాథమిక వైద్య సేవలు అందించిన అనంతరం ఆయనను రుద్రంపూర్‌లోని ఎస్‌బీఐ బ్రాంచ్ సమీపంలో ఉన్న సేవా సంస్థ ఆశ్రమానికి తరలించారు. అక్కడ ఆయనకు తగిన నివాసం, భద్రత, అవసరమైన సహాయ సేవలు అందిస్తున్నట్లు సంస్థ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ. బాధలో ఉన్నవారిని ఆదుకునే అవకాశం కలిగినందుకు భగవంతునికి కృతజ్ఞతలు. ఈ సమాచారం అందించిన మంచి మనసుతో కూడిన వ్యక్తులకూ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు అని వెల్లడించారు.

## సమస్యల సత్వర పరిష్కారానికి కృషి: వెంకట మోహన్‌రావు



**రుద్రంపూర్ జూన్ 16 నవభూమి:** రామవరం భద్రాద్రి కొత్తగూడెం ఏరియాలోని పర్సనల్ డిపార్ట్‌మెంట్ పనులను పూర్తి చేస్తామని, ఉద్యోగులను పలుమార్లు కార్యాలయాలకు తిప్పుకోకుండా వారి సమస్యలను త్వరితగతిన పూర్తిచేసేందుకు కృషి చేస్తానని కొత్తగూడెం ఏరియా డిప్యూటీ జీఎం (పర్సనల్) గామలపాటి వెంకట మోహన్‌రావు తెలిపారు. సోమవారం విధుల్లో చేరిన సందర్భంగా పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులు, సిబ్బంది, జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఆయనకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

**కామేపల్లి,నవభూమి,జూన్ 16 :** కామేపల్లి మండలం ముచ్చర్ల-జాస్తిపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92 సంవ త్సరంలో 10వ,తరగతి చదివిన పూర్వ విద్యార్థు లు కొత్త లింగాల లక్ష్మీ ఫంక్షన్ హాల్ లో కలుసు కున్నారు.ఈ సందర్భంగా తమ చిన్ననాటి జ్ఞాప కాలను ఒకరితో మరొకరు పంచుకున్నారు.నాటి గురువులు జానకిరామయ్య,సాధు లక్ష్మణరావు లకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ బ్యాచ్ లో భగవద్గీతలోని 720 శ్లోకాలను కంఠ స్థం చేసిన సహచర విద్యార్థి అయిన మద్దినేని ఉషారాణి ని పూర్వ విద్యార్థులు సన్మానించా రు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యల్లమద్ది రమేష్,రామారావు,నారాయణ, రామయ్య,పరమాత్మచారి,కోటయ్య,ప్రసన్నకుమార్,దామోదర్,నరసింహారావు, యాకుబ్ పా షా,గుండ్ల రమేష్,వనిత,వరలక్ష్మి, ఉషారాణి అన్నపూర్ణ,రోజా,రమణి,గుడిమెట్ల శేఖర్ తది తరులు పాల్గొన్నారు.



### కామేపల్లి హరిజనవాడ అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన

# మిషన్ భగీరథ ఏఈఈ సతీష్ కుమార్

- కేంద్రం నిర్వహణ, మెనూ అమలు పరిశీలన
- చెక్ లిస్ట్ ప్రకారం రిజిస్టర్లు,కిచెన్ షెడ్ పర్యవేక్షణ
- హరిజనవాడ కేంద్రం ఆదర్శం,అభినందనీయం




**కామేపల్లి,నవభూమి,జూన్ 16 :** కామేపల్లి హరిజనవాడ అంగన్వాడీ కేంద్రాన్ని మిషన్ భగీరథ ఇంట్రా విభాగం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బండి సతీష్ కుమార్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. జిల్లా కలెక్టర్,స్థానిక ఎంపీడీవో జి.రవీందర్ ఆదేశాల మేరకు చెక్ లిస్ట్ ప్రకారం కేంద్రంలో త నిఖీలు నిర్వహించారు.కేంద్రం నిర్వహణ,అంగన్వాడీ టీచర్ పిడమర్తి ఉపేంద్రమ్మ,సిబ్బంది పనితీరు,రిజిస్టర్లు,స్టాక్, ప్రీ స్కూల్ ఆట వస్తువులు,పిల్లల బరువులు చూసే మిషన్,కిచె న్ గార్డెన్, కిచెన్ షెడ్,మెనూ అమలు,మంచినీటి సదుపా యం,విద్యుత్ సదుపాయం తదితర వాటిని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. హరిజనవాడ అంగన్వాడి కేంద్రం ఆదర్శనీయమని, అభినందనీయమని ఈ సంద ర్భంగా పేర్కొన్నారు.కేంద్రం ద్వారా పిల్లలు,తల్లులు, గర్భి ణీలకు అందజేస్తున్న సేవలు పట్ల సంతృప్తిని వ్యక్తం చేశా రు.ఈ కార్యక్రమంలో అంగ న్వాడీ టీచర్ పిడమర్తి ఉపేంద్రమ్మ,మిషన్ భగీరథ వర్క్ ఇన్స్పెక్టర్ అంజం రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గోపాలపురం, పెద్ద లచ్చతండా అంగన్వాడీ కేంద్రాలను కూడా సందర్శించి చెక్ లిస్ట్ ప్రకారం సదుపాయా లను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు వై.జ్ఞానమ్మ,ఏ.నిర్మల, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

### 130 క్వింటాళ్లకు రిక్వెస్ట్ పెడితే

# 130 కేజీలే తూకం

**రఘునాథపాలెం, -నవభూమి:** మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ కోసం కొత్తగా ప్రభుత్వం తీసుకొచ్చిన సాఫ్ట్‌వేర్ రేషన్ డీలర్లను అవస్థలకు గురి చేస్తూనే ఉంది. నూతన అప్లికేషన్‌పై అవగాహన కల్పించకపోవడంతో దానిని అర్థం చేసుకునేందుకు డీలర్లు సతమతమవుతున్నారు. 'ఈ-పాస్' యంత్రంలో అప్‌డేట్ చేసిన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ (యాప్)ను ఎలా ఆపరేట్ చేయాలో అర్థం కాక జూన్ నెల మొదట్లో అనేకమంది డీలర్లు షాపులను బంద్‌పెట్టి కూర్చున్నారు. అయితే 'ఆరు వేలిముద్రలు మూడు తూకాలు' విధానం వల్ల జరుగుతున్న జాప్యాన్ని గుర్తించిన ప్రభుత్వం.. దానిని మూడు వేలిముద్రలకు కుదించి డీలర్లకు కాస్త ఉపశమనం కలిగించింది. కానీ కొత్త సాఫ్ట్‌వేర్‌పై డీలర్లకు ముందస్తు అవగాహన కల్పించకపోవడంతో నిత్యం వారు ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటూనే ఉన్నారు.'పోర్టబిలిటీ రిక్వెస్ట్'పైనా గందరగోళం తాజాగా పోర్టబిలిటీ రేషన్ (అదనపు కోటా) రిక్వెస్ట్ విషయంలోనూ డీలర్లకు సమస్య ఎదురైంది. పోర్టబిలిటీ రిక్వెస్ట్ ఎన్నిసార్లు పెట్టినా గత సాఫ్ట్‌వేర్ తీసుకునేది. ఎన్నో ఏళ్లుగా ఉన్న ఈ సాఫ్ట్‌వేర్‌పై డీలర్లకు అవగాహన ఉండడంతో వారు ఈ పోర్టబిలిటీ రిక్వెస్ట్‌ను సులువుగా పెట్టేవారు. కానీ మూడు నెలల బియ్యం పంపిణీ కోసం జూన్‌లో వచ్చిన కొత్త అప్లికేషన్ అర్థం కాకపోవడంతో పోర్టబిలిటీ రిక్వెస్ట్ విషయంలో పొరపాట్లు చేసి తలలు పట్టుకుంటున్నారు.పోర్టబిలిటీ రేషన్ రిక్వెస్ట్ 'కేజీల్లో' చూపిస్తుండగా కొందరు డీలర్లు దానిని గమనించకుండా ఎప్పటిలాగానే 'క్వింటాళ్లు'గా భావించి రిక్వెస్ట్ పెట్టేశారు. కానీ అప్లికేషన్ మాత్రం 'కేజీల్లో' తీసుకుంటోంది. దీంతో డీలర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 100 క్వింటాళ్ల అదనపు కోటా కోసం రిక్వెస్ట్ పెట్టుకున్న డీలర్లకు కేవలం క్వింటా మాత్రమే కేటాయింపు జరుగుతోంది. దీంతో తన షాపు పరిధిలో 100 క్వింటాళ్ల అదనపు కోటా అవసరమై అర్జీ పెట్టుకున్న డీలర్‌కు క్వింటా మాత్రమే కోటా రిలీజ్ కావడంతో బిక్కమొహం వేస్తున్నాడు. బియ్యం కోసం వచ్చిన కార్డుదారులకు సమాధానం చెప్పలేక సతమ తమవుతున్నాడు.

# మహోన్నత వ్యక్తి మదన్‌లాల్

**ఖమ్మం, -నవభూమి:** గిరిజనుల హకుల కోసం అహర్నిశలు శ్రమించిన మహోన్నత వ్యక్తి మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ అని ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ కొనియాడారు. ఆదివారం ఖమ్మం నియోజవర్గ కేంద్రంలోని వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ నివాసానికి వెళ్లి అతడి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. మదన్‌లాల్ భార్య మంజుల, కుమారుడు మృగేందర్‌లాల్, సోదరుడు సుందర్‌లాల్‌తో మాట్లాడి సానుభూతి వ్యక్తం చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న సందర్భంలో తనకు మదన్‌లాల్ మృతిచెందిన వార్త తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు తెలిపారు.కుటుంబ సభ్యులకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు ఉప్పలపాటి వెంకటరమణ, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్, వైరా నియోజవర్గ ముఖ్య నాయకులు గిరిబాబు, ముత్యాల వెంకట అప్పారావు, రావూరి శీను, మంగీలాల్, జడల వెంకటేశ్వర్లు, గౌస్, జూలూరుపాడు మాజీ జడ్పీటీసీ కళావతి, పొన్నం హరికృష్ణ, కొత్త వెంకటేశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు, కిల్లారు కిరణ్, దేవరాజ్, చెల్లా మోహన్‌రావు, జగన్, యలమద్ది రవి, తెలంగాణ ఉద్యమకారులు పగడాల నరేందర్, సతీష్, రసూల్, సద్దాం షేక్, షారుక్, మెదమెట్ల రాము పాల్గొన్నారు.బోడపట్ల వెంకన్నకు పరామర్శ ఖమ్మంలోని ప్రముఖ కాంట్రాక్టర్ బోడపట్ల వెంకన్న గుండె ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలుసుకున్న తాతా మధుసూదన్ ఆదివారం అతడిని పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి వారి ఇంటికెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పలపాటి వెంకటరమణ, బిచ్చల తిరుమలరావు, పగడాల నరేందర్, రసూల్, లింగన్నబోయిన సతీష్, యలమద్ది రవి, షేక్ సద్దాం, షారుఖ్, అరాఫత్ పాల్గొన్నారు.



# ప్రభుత్వ విద్యను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది

### ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మగాని హరీష్





**ఇల్లెందు జూన్ 16 నవభూమి ప్రతినిధి:** ఇల్లెందులోని ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను అఖిల భారత విద్యార్థి బృందం (ఏఐఎస్ఎఫ్) సోమవారం సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మగాని హరీష్ మాట్లాడుతూ ముందుగా నూతన విద్యా సంవత్సరంలో అడుగిడిన విద్యార్థినీ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలను కళాశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రభుత్వ పాఠశాలల్లో కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచే దిశగా విద్యార్థులు అందరూ సహకరించాలని, విద్యార్థుల సంఖ్య తగ్గితే ప్రభుత్వ పాఠశాలలో మూసివేసే ప్రమాదం ఉందని తద్వారా ప్రైవేట్ పాఠశాలలకు రెక్కలు వస్తాయని వారి ఈ సందర్భంగా గుర్తు చేశారు. గ్రామీణ స్థాయిలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాల్సిన బాధ్యత గ్రామస్తులపై గాని గ్రామంలో ఉన్న రాజకీయ నాయకులపై గాని ఉందని వారు గుర్తు చేశారు. ప్రభుత్వం అందించే విద్యను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ విద్య పటిష్టం అయ్యేంతవరకు గ్రామస్థాయి నుండి కచ్చితంగా ఒక నాణ్యమైన విద్య కోసం పోరాటం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి ఎన్ సాయి, సత్యాన్వేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యల పరిష్కారానికే రైతు సదస్సులు:ఏఎంసి చైర్మన్ బండారు

**ఎర్రపాలెం,నవభూమి,జూన్ 16:** మండ లంలోని రైతుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రజాప్రభుత్వంరైతుసదస్సులు నిర్వహించి రైతులకుఎటువంటి ఇబ్బందు లు లేకుండా కృషి చేస్తుందని మధిర ఏఎంసి చైర్మన్ బండారు నరసింహారావు అన్నారు.మండల పరిధిలోని చొప్పకట్ల పాలెం,రాజుల దేవరపాడు గ్రామాల్లో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సు లలో బండారు నరసింహారావు మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డిలు పాల్గొనిమాట్లాడుతూ చొప్పకట్ల పాలెం గ్రామంలో ఉన్న అసైన్మెంట్ భూము లకు సంబంధించినభూసమస్యల గురించి అధికారులకువివరించారు.గ్రామంలో అందరూచిన్న,సన్నకారు రైతులు ఉన్నార ని వారందరికీ పట్టాదారుపాసు పుస్తకాలు ఇవ్వాలని రెవిన్యూ అధికారులను కోరారు.అలాగే రైతు సమస్యలు తక్షణంపరిష్క రించే విధంగా చేయాలని కోరారు. తహ సిల్దార్ ఉషా శారద మాట్లాడుతూ మండ లంలో రైతులకు ఉన్న అన్ని సమస్యలు భూభారత్ చట్టంలో పరిష్కరించేందుకు రైతు సదస్సులద్వారా ఆయా గ్రామాల్లో ఉన్న భూ సమస్యలను రైతుల ద్వారా తెలుసుకొని,దరఖాస్తులు స్వీకరించి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ లు ఎస్ రవి కుమార్,బి రాజశేఖర్, ఏఎస్ఓ జాన్ దర్గాసాహెబ్,యుడిసి శిరీష,నరేష్,చందు,వరలక్ష్మి,రెవిన్యూ సిబ్బంది,రెండు గ్రామాల రైతులు,మాజీ ప్రజా ప్రతినిధులు,ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# ఘనంగా సిపిఐ శాఖ మహాసభలు








**కొత్తగూడెం జూన్ 16 నవభూమి ప్రతినిధి:** సిపిఐ శాఖ మహాసభలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా లక్ష్మీదేవిపల్లి మండలం ఉమ్మడి సీతారాంపురం పంచాయతీలో సోమవారం స్థానిక గుడి వద్ద ఏర్పాటు చేసిన సభలో పెద్ద ఎత్తున ఉమ్మడి సీతారాంపురం పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.అక్కడ ఏర్పాటు చేసిన సిపిఐ జెండాను జిల్లా సిపిఐ కార్యదర్శి సాబీర్ పాషా స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు.సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ ఉమ్మడి సీతారాంపురం పంచాయతీ ఎప్పుడు సిపిఐ వెంట ఉందని సిపిఐ కూడా సీతారాంపురం పంచాయతీ వెంట ఉంటుందని ఈ ప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని సాబీర్ పాషా వివరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు.ఎప్పుడు ప్రజల వెంట ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవిపల్లి మండల సెక్రెటరీ చంద్రగిరి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ నూనావత్ గోవింద్,మాజీ సర్పంచ్ బోడ రాములు, సిపిఐ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఫహీం, నేరెళ్ల రమేష్, ఖయ్యూం, ఉపేందర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

# మొత్కూరి ధర్మారావును సన్మానించిన రామలక్ష్మణ్



**కొత్తగూడెం జూన్ 16 నవభూమి ప్రతినిధి:** ఏఐసీసీ ప్రకటించిన టిపిసిసి నూతన కార్యవర్గంలో జనరల్ సెక్రటరీగా నియమితులైన మోత్కురి ధర్మారావు ను సోమవారం ఆయన నివాసంలో టిపిసిసి సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి, ఖమ్మం పార్లమెంట్ సోషల్ మీడియా ఇంచార్జ్ వీరాపురం రామలక్ష్మణ్ రావు కొత్తగూడెం నియోజకవర్గం సేవాదళ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూరేటి నరేష్, యువజన కాంగ్రెస్ నాయకులు బాణోత్ కోటేష్ నాయక్ కలసి పూల మొక్క ఇచ్చి శాలువాతో సత్కరించారు.



# లక్ష్మీదేవిపల్లి మండల ప్రెస్ క్లబ్ ఎన్నిక ఏకగ్రీవం

### అధ్యక్షునిగా రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా యాకుపాషా







**కొత్తగూడెం జూన్ 16 నవభూమి ప్రతినిధి:** లక్ష్మీదేవిపల్లి మండల జర్నలిస్టుల ప్రెస్ క్లబ్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా జిల్లా కేంద్రంలోని శ్రీ క్రిష్ణ ఇన్ హెూటల్ లో జర్నలిస్టులు సమావేశమై ఈ కమిటీని ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులుగా శంకర్ (వార్త), అధ్యక్షుడిగా రాజ్ శేఖర్ (మన తెలంగాణ), ఉపాధ్యక్షుడిగా శేఖర్ (సాక్షి), పురుషోత్తం (జనంసాక్షి), ప్రధాన కార్యదర్శిగా యాకుబ్ పాషా (ఆంధ్రప్రభ), సహాయ కార్యదర్శిగా మురళి (మనం), నాగరాజు (సూర్య), కోశాధికారిగా వెంకట్ (నవతెలంగాణ), క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా ఎం. ఏ.వహాబ్ (నవభూమి), రాజేందర్ (వెలుగు), షఫీ (సూర్య), ప్రసాద్ (మెట్రో ఈవెనింగ్), సతీష్ (దిశ), అశోక్ (ప్రజాజ్యోతి) లను ఎన్నుకున్నారు.

# తల్లాడ మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వచ్ఛ మిత్ర కార్మికులుగా గుర్తించాలి

**తల్లాడ, నవభూమి, జూన్ 16:** తల్లాడ మండలంలోని వివిధ పాఠశాలలో పనిచేస్తున్న స్వచ్ఛ మిత్ర కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం గుర్తించి అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా వేతనం చెల్లిస్తున్నారని అలా కాకుండా స్వచ్ఛమిత్ర కార్మికులుగా ప్రభుత్వమే వారిని గుర్తించి వారి యొక్క వ్యక్తిగత ఖాతాలలో వేతనాన్ని జమ చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా తల్లాడ మండల విద్యాశాఖ అధికారి ఎం దామోదర్ ప్రసాద్కు వినతి పత్రం సమర్పించారు. 2015నుంచి స్వచ్ఛభారత్ పేరుతో వీరి నియమించి 2019 వరకు విధులు నిర్వహించారని. అనంతరం కరోనా సందర్భంగా స్వచ్ఛమిత్ర కార్మికులను వారికి విధులు నిధులు లేక ఆగిపోయారని. 2023 నుంచి స్వచ్ఛ మిత్రులుగా గుర్తించారని వీరిని ఇకనుంచి అయినా వారి యొక్క వ్యక్తిగత ఖాతాల్లో వేతనం జమ చేయాలని అమ్మ ఆదర్శ కమిటీలతో ఆ ఎకౌంటు సంబంధం లేకుండా నేరుగా స్వచ్ఛమిత్ర ఎకౌంట్లోనే ఆ అమౌంట్ ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థుల సంఖ్య సంబంధాలు లేకుండా ప్రతి ఒక్కరికి ఒకే వేతనం ఉండే విధంగా ప్రభుత్వం రూపొందించాలని కనీస వేతనం 26,000 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే స్వచ్ఛ మిత్రులను ఈ ఈ ఎస్ ఐ . పీఎఫ్. పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే తిరిగి 12 నెలల కాలానికి జీతం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వమే 10 లక్షల ఇన్సూరెన్స్ ఈ పేరు మీద ప్రభుత్వం ఇవ్వాలని కోరారు ఈ కార్యక్రమంలో స్వచ్ఛ మిత్ర సంఘం నాయకురాలు. చిన్నమ్మ, మౌనిక, రాధా, తేలపుట్ల యేసు, షేక్ నసీరా, తెనాలి ఝాన్సీ, గోపాల్ రావు, శివకృష్ణ, రమేష్, కే వెంకటమ్మ, స్వరూప, సంధ్యారాణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## లాభసాటి పంటల సాగుపై రైతులు

# దృష్టి సారించాలి:సీఎం రేవంత్ రెడ్డి

**ఖమ్మం/నేలకొండపల్లి, నవభూమి, జూన్ 16:** లాభసాటి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం రైతులతో సీఎం రేవంత్ ముఖాముఖి కార్యక్రమానికి నేలకొండపల్లి రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి హాజరయ్యారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి సీఎం రేవంత్ రెడ్డి 1034 రైతు వేదికల్లో నూతనంగా రైతు నేస్తం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు, ఇతర మంత్రులు, సీఎస్ కె. రామకృష్ణా రావు లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రైతుల ఆశీర్వాదం లేకపోతే ప్రజా ప్రతినిధిగా రాణించలేమని, గ్రామ వార్డు సభ్యుల నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రతి ఒక్కరికి రైతు చల్లని చూపులు అవసరమని అన్నారు. ఆర్థికంగా రాష్ట్రాన్ని విధ్వంసం చేసి మనకు అప్పగించారని, మనం అధికారంలో వచ్చే సమయానికి రైతుల ధాన్యం కొనలేని పరిస్థితి, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించని దుస్థితిలో రాష్ట్రం ఉండేదని, గత పాలకులు వరి వేస్తే ఉరి అనే స్థితి తీసుకొని వచ్చారని అన్నారు. నేడు ప్రజా ప్రభుత్వంలో చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నదని, సన్న రకం ధాన్యానికి క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. పేదలకు సన్న బియ్యం రేషన్ ద్వారా పంపిణి చేస్తున్నామని తెలిపారు. గత పాలకుల హయాంలో పెండింగ్ పెట్టిన బకాయిలను మెల్ల మెల్లగా చెల్లిస్తున్నామని అన్నారు. ఒక్కొక్క వ్యవస్థను ప్రభుత్వం బాగు చేస్తుందని అన్నారు. 9 రోజులలో రైతులకు 9 వేల కోట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, 70 లక్షల 11 వేల 984 మంది రైతులకు డబ్బులు బదిలీ చేస్తామని అన్నారు. రైతుల చేతిలో డబ్బులు ఉంటే పెట్టుబడి కోసం అప్పు చేయాల్సిన దుస్థితి రాదని అన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, ధాన్యం కొనుగోలు, ఉచిత విద్యుత్తు, రైతు భీమా, పరిహారం, బోనస్ కలిపి మొత్తం 18 నెలల్లో లక్షా 1 వేయి 728 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిన రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు.గత పాలకులు చేసిన రుణమాఫీ, మనం చేసిన రుణమాఫీపై గ్రామాలలో చర్చ పెట్టాలని అన్నారు. గతంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని , మనం 8 వేలకు పైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 48 గంటల్లో రైతులకు ఖాతాలో పంట డబ్బులు జమ అయ్యేలా చూశామని అన్నారు. దోపిడిదారులకు ధరణి చుట్టం ఐతే, భూ భారతి ద్వారా భూ సమస్యల పరిష్కారం చేస్తున్నామని అన్నారు. ప్రజల చావుల మీద అధికారం రావాలని ప్రతిపక్షాలు కుటిల ఆలోచనలు చేస్తున్నా యని అన్నారు. గతంలో ఎప్పుడైనా సీఎం ఫాం హౌస్ దాటి వచ్చారా అని అన్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధించామని, గతంలో దళితుల నుంచి ఒక మంత్రి ఉంటే తమ ప్రభుత్వ హయాంలో స్పీకర్ తో కలిసి 5 దళిత సామాజిక వర్గ సభ్యులు ఉన్నత స్థాయిలో ఉన్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఒక సంవత్సరంలో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు అందించామని, సివిల్ సర్వీసెస్ చదువుకునే పిల్లలకు 2 లక్షల రూపాయల సహాయం అందించామని అన్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు సబ్సిడీతో అందించేందుకు చర్యలు తీసుకోవాలని, లాభసాటి వ్యవసాయం సాధన దిశగా కృషి చేయాలని అన్నారు. రైతులకు సాంకేతికత బదిలీ చేయాల్సిన అవసరం ఉందని, ఏఐ ద్వారా ఎక్కడ సమస్య ఉందో తెలిస్తే అక్కడే ఎరువులు చల్లితే మనకు ఖర్చు తప్పుతుందని, భూ సారం పెరుగుతుందని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం 17 వేల కోట్ల రూపాయల చెల్లించిందని, మనం సోలార్ కు మారితే ఈ డబ్బులు ఆదా చేసుకోవచ్చని, మహిళలకు నెలకు రెండు నుంచి మూడు వేల రూపాయల వరకు అదనంగా ఆదాయం కూడా లభిస్తుందని అన్నారు. సోలార్ పంప్ సెట్ వల్ల ప్రయోజనం, లాభసాటి పంటల సాగుపై సీనియర్ రైతులతో రైతు వేదికలలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు జరపాలని అన్నారు. పంట మార్పిడి వ్యవస్థ తప్పనిసరిగా రావాలని, జొన్న రొట్టె తింటే మన ఆరోగ్యం బాగుంటుందని అన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రైతు పక్షపాతిగా తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. గత పాలకులు సృష్టించిన ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తూ ఇందిరమ్మ ప్రభుత్వం 21 వేల కోట్ల రుణ మాఫీ, 13 వేల 88 కోట్ల రైతు భరోసా, క్వింటాకు సన్న బియ్యం 500 బోనస్ క్రింద 1119 కోట్లు, రైతు భీమా క్రింద 2181 కోట్ల రూపాయలు, 200 కోట్లకు పైగా పంట నష్ట పరిహారం, 16 వేల 691 కోట్లతో ఉచిత విద్యుత్ సరఫరా, 11 వేల కోట్లతో సాగు నీటి ప్రాజెక్టుల కింద మొత్తం 70 వేల కోట్లు ఖర్చు చేశామని అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ యోగ్యమైన కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు పూర్తి స్థాయిలో రైతు భరోసా డబ్బులను జమ చేసే కార్యక్రమం రైతుల సమక్షంలో నేడు ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. 9 రోజుల వ్యవధిలో రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతాయని అన్నారు. రైతు కూలీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద 12 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నామని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఒకటిన్నర సంవత్సర కాలంలో రైతు సంక్షేమానికి 70 వేల కోట్లు రూపాయలు ఖర్చు చేసిన ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మాత్రమేనని అన్నారు. 10 నెలల కాలంలో 21 వేల కోట్ల రుణమాఫీ మన ప్రభుత్వం చేసిందని అన్నారు. గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రైతు బంధు బకాయిలు 7 వేల 625 కోట్ల రూపాయల రైతుల ఖాతాలో జమ చేశామని అన్నారు. దేశంలో అత్యధికంగా వరి పంట సాగు చేస్తున్నది తెలంగాణ రైతు అని అన్నారు. దేశం మొత్తం తెలంగాణ రాష్ట్ర పాలన కావాలని నేడు కోరుకుంటుందని అన్నారు. ఉచిత విద్యుత్తు, నీటి పారుదల ప్రాజెక్టు, రుణమాఫీ వంటి అనేక రైతు సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ పార్టీ బ్రాండ్ అంబాసిడర్ అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వినూత్నంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. కృష్ణ, గోదావరి నదులలో రైతులకు అన్యాయం జరిగిందంటే కారణం గత పాలకులదని మంత్రి విమర్శించారు. సీఎస్ కె. రామకృష్ణా రావు మాట్లాడుతూలి దేశంలో ప్రగతి శీల రైతులు ఉన్న రాష్ట్రం తెలంగాణ అని, మన రైతులు సంపన్నులు కావాలనే ఉద్దేశంతో తెలంగాణ రైజింగ్ 2047 లో భాగంగా రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సాంకేతికతను వినియోగిస్తూ దాదాపు 6 లక్షల మంది రైతులు నేటి కార్యక్రమంలో పాల్గొంటున్నారని అన్నారు. నేలకొండపల్లి రైతు వేదిక నుంచి రైతు ఎం. రామకృష్ణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఇంటరాక్ట్ అయ్యారు. రైతు నేస్తం కార్యక్రమం లో జరిగిన 57 ఎపిసోడ్స్ మిస్ కాకుండా హాజరయ్యానని అన్నారు. వ్యవసాయ శాఖ అనుబంధ రంగాల శాస్త్రవేత్తల ద్వారా అందించే విజ్ఞానం రైతులకు చాలా ఉపయోగపడుతుందని అన్నారు. వ్యవసాయ విస్తరణ కార్యక్రమం తెలంగాణ రాష్ట్రంలో బాగుందని తమిళనాడు బృందం కూడా వచ్చి స్టడీ చేసి వెళ్లిందని అన్నారు. ముఖ్యమంత్రి స్పందిస్తూ రాష్ట్రంలో ముఖ్యమైన రెవెన్యూ, ఆర్థిక, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు ఖమ్మం జిల్లాలో ఉన్నారని, రైతులు మంచి లాభసాటి పంటలు పండించాలని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి రైతు భరోసా నిధులను రైతు ఖాతాలలో బదిలీ చేసే కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. వీడియో సమావేశం అనంతరం రైతు వేదికలో హాజరైన రైతులతో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో ఖమ్మం జిల్లా రైతులు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. సీఎం సూచనల మేరకు ప్రభుత్వం అందించే రైతు భరోసా పెట్టుబడి డబ్బులతో రైతులు అన్ని రకాల పంటలు సాగు చేయాలని అన్నారు. ఆదర్శ రైతులచే రైతు వేదికలలో వారి అనుభవాలు పంచుకునే విధంగా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత,మండల వ్యవసాయ అధికారిణి రాధ, అధికారులు,రైతులు, పాల్గొన్నారు.











